క్లుప్తంగా

మద్ది అంజన్నను దర్శించుకున్న భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రంలో జరుగుతున్న కార్తీక మాస మహోత్సవాల్లో భాగంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారికి తమలపాకులతో విశేష పూజలు చేశారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉసిరిచెట్ల కింద కార్తీక దీపారాధనలు చేశారు. ప్రసాద వితరణకు అంజిరెడ్డి కుటుంబ సభ్యులు రూ: 50వేలు విరాళం అందజేసినట్లు ఈవో ఆకుల కొండలరావు తెలిపారు.

ఫ్రిజ్ బహూకరణ


ఫ్రిజ్ బహూకరిస్తున్న దాత నల్లూరి మధు

కొయ్యలగూడెం: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కల్పవృక్షం వృద్ధాశ్రమానికి రూ.25 వేలు విలువైన ఫ్రిజ్‌ను దాత మధు శనివారం బహూకరించారు. గవరవరం గ్రామానికి చెందిన నల్లూరి మధు (మేధా పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్) ఫ్రిజ్‌ను వృద్ధాశ్రమ నిర్వాహకులు మాదేటి అప్పలరాజు సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో కొనకళ్ళ రాంబాబు, మాదేటి సత్యనారాయణ, నల్లూరి సుబ్బారావు, కొల్లూరి రామకృష్ణ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనాలు ప్రారంభం


భవనాలను ప్రారంభిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: పంగిడిగూడెంలో పలు అభివృద్ధి భవన నిర్మాణాలను ప్రారంభించారు. సచివాలయం, రైతుభరోసా, వెల్‌నెస్ సెంటర్ల భవనాలను ప్రారంభించారు. సంక్షేమం, అభివృద్దే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన చేస్తుందని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు కొప్పుల రవిచంద్రారెడ్డి, ఉప సర్పంచ్ పైడిమళ్ల రమేష్, ఎంపీటీసీ ధనలక్ష్మీ, స్థలదాత కొప్పుల నరసింహారెడ్డి, పార్టీ నాయకులు పంపన వీరాస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన ఛైర్‌పర్సన్ లక్ష్మి

జంగారెడ్డిగూడెం: మున్సిపల్ కౌన్సిల్, అధికారుల ఆధ్వర్యంలో పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. శనివారం స్థానిక 9 వ వార్డు చెరువు గట్టు దగ్గర కొబ్బరికాయ కొట్టి సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, యూత్ జిల్లా అధ్యక్షుడు గిరిబాబు, జేసీఎస్ జిల్లా కన్వీనర్ అనిల్, సీనియర్ నాయకులు కంచర్ల విష్ణు, చిప్పాడ వెంకన్న, నేట్రు గణేష్, కాటం అనిల్, విప్పర్తి సురేష్, యలమంచిలి వాసు, మామిడి శ్రీనివాసరావు, ఉర్లాపు నాగేశ్వరరావు, దిరిశిపాము రాజేష్ పాల్గొన్నారు

రేపు కోటి దీపోత్సవం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం బైనేరు సమీపంలోని ఉమా సహిత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం కోటి దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ మేకా సింహాద్రి, ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ బచ్చు రామ్మోహన్ రావు శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. భక్తులు తమ పేర్లను ఆలయ కమిటీ వద్ద నమోదు చేయించుకోవాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం కరికాల భక్త సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు కమిటీ వివరాలు వెల్లడించారు. అధ్యక్షుడిగా కరెళ్ళ రామకృష్ణ, కార్యదర్శి వడుగు శేషారావు, కోశాధికారి సోరపల్లి వెంకట దుర్గా ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా పినిశెట్టి నాగ సత్యనారాయణ, కరెళ్ళ శ్రీధర్, ఆదిన శివశ్రీ, ఆదిన శ్రీను, అయిశెట్టి ప్రసాద్, మోటుపల్లి మల్లికార్జునరావు, మీడియా ఆర్గనైజర్ ఆదిన ఈశ్వర్ ఎన్నికైనట్లు తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలని ధర్నా

బుట్టాయగూడెం: వసతి గృహం విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఈ.భూషణం మాట్లాడుతూ వసతిగృహాల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్‌కు అందజేశారు.

చంద్రబాబుకు పేదలంటే చులకన

పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు విమర్శ

కుక్కునూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల కోసం సంక్షేమ పథకాలు అందిస్తుంటే అది చూసి తట్టుకోలేక చంద్రబాబు ప్రజలను సోమరిపోతులను చేస్తున్నారని వ్యాఖ్యానించారని, దీనినిబట్టే చంద్రబాబుకు పేదలంటే ఎంత చులకనో అర్థమవుతుందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు విమర్శించారు. శనివారం మండలంలోని మాధవరం సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం, రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలంటే.. కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న బాలరాజు, మాధవరం సచివాలయం పరిధిలోని మాధవరం, చీరవెల్లి, కొత్తూరు, మద్రిపాడు తదితర గ్రామాల్లో ప్రతీ ఇంటికి తిరిగి ప్రభుత్వం తరుపున ప్రజలకు అందని లబ్ధిని వివరించారు. స్థానికంగా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చీరవెల్లి ప్రధాన సెంటర్‌లో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో బాలరాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు ప్రవేశపెట్టి ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తుంటే విమర్శలు చేసిన టీడీపీ నాయకులు.. ఇప్పుడు తాము అధికారంలోకి వస్తే పేర్లు మార్చి పథకాలను కొనసాగిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల ముందు వాగ్దానాలుచేయడం, అధికారంలోకి వచ్చిన తరువాత తెప్పతగలేయడం చంద్రబాబుకు కొత్తేమి కాదన్నారు. ప్రజలకు మేలు చేయాలన్న మనస్తత్వం మన జగనన్నదని అందుకే రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అవసరం అన్నారు. నిర్వాసితుల విషయంలో ఇచ్చిన వాగ్దానాలన్నింటిని జగనన్న తప్పక నెరవేర్చుతాడని, ఈ విషయంలో ఎవరు ఎన్ని అబద్ధపు ప్రచారాలు చేసినా వాటిని నమ్మొద్దన్నారు. మాట ఇచ్చిన ప్రకారం ఇప్పటికే నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ రూ. 10 లక్షలు ఇచ్చే నిమిత్తం జీవోను చేశారని, గతంలో ఎకరాకు రూ.1.30 లక్షలు, రూ.1.15లక్షలు పరిహారం తీసుకున్న భూములకు రూ.5 లక్షలు అందిస్తారని చెప్పారు. ప్రజలకు మేలు జరగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తాండ్ర రాజేష్, వైస్ ఎంపీపీ గాడిద రామచంద్రం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగుల రమణారెడ్డి, ఎంపీటీసీ కుండా సూర్యనారాయణ, గ్రామ కన్వీనర్ గంజి రాజేష్, యూత్‌నాయకుడు చేకూరి నవీన్ వర్మ, చేకూరి సూర్యనారాయణ రాజు, రాయి సత్యనారాయణ, రాయి రవి, నాయకులు, కార్యకర్తలు జేసీఎస్ కన్వీనర్‌లు, గృహసారథులు పాల్గొన్నారు.


చీరవెల్లి సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల లబ్ధి డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

పింఛన్ల పంపిణీ


లక్కవరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ జ్యోతి

జంగారెడ్డిగూడెం రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు పంపిణీ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ కొదమ జ్యోతి అన్నారు. మండలంలోని లక్కవరంలో లబ్ధిదారులకు ఎంపీపీ పింఛన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయం -1 కన్వీనర్ మల్లెల్లి సూర్యనారాయణ, గృహ సారథులు పాల్గొన్నారు.

నేడు బొర్రంపాలెంలో ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

టి.నరసాపురం: మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో ఆదివారం ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పర్యటిస్తారని జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు తెలిపారు. పర్యటనలో భాగంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని, వెల్‌నెస్ సెంటర్‌ను వారు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

నేడు ఆర్యవైశ్యుల కార్తీక వనసమారాధన

కొయ్యలగూడెం: ఆర్యవైశ్య కార్తీక వన సమారాధన ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఏఎంసీ డైరెక్టర్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరు సత్తిబాబు పేర్కొన్నారు. రేపల్లెవాడ మేధా పబ్లిక్ స్కూల్లో నిర్వహించే కార్తీక వన సమారాధనకు ఆర్యవైశ్య కుటుంబీకులు హాజరుకావాలని ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పేద విద్యార్థులకు నగదు పురస్కారంతో పాటుగా వృద్ధ దంపతులను సత్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.

శ్రీవారి క్షేత్రం.. భక్తజన సంద్రం


ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. కార్తీకమాస పర్వదినాలు కావడంతో పాటు, స్వామివారికి ప్రీతికరమైన రోజు అవడంతో సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దాంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది. దాంతో అన్ని విభాగాలు భక్తులతో కళకళలాడాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా భక్తులతో నిండిపోయాయి. అలాగే కేశఖండనశాల, నిత్యాన్న దాన భవనం, టికెట్, ప్రసాదాల కౌంటర్లు, దర్శనం క్యూలైన్లు ఇలా అన్ని విభాగాలు భక్తులతో పోటెత్తాయి.

రాష్ట్ర ప్రజలకు అండగా సీఎం జగన్


సాగిపాడులో సంక్షేమ పథకాలు వివరిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా

కామవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు సంక్షేమ పథకాలు అందించి రాష్ట్ర ప్రజలకు అండగా నిలిచారని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. శనివారం మండలంలోని సాగిపాడు గ్రామంలో నిర్వహించిన 207వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి, వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గూర్చి లబ్దిదారులకు వివరించి, సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో హామీలు ఇచ్చి రాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నూరుశాతం నెరవేర్చారన్నారు. రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఉద్దేశంతో డ్వాక్రా సంఘాల ద్వారా సున్నా వడ్డీ, స్త్రీ నిధి, ఆసరా పథకాలు ఇచ్చి అక్కా చెల్లెళ్లకు అండగా నిలిచారన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేదవాడు ఉన్నత చదువులు చదవాలనే ఉద్దేశంతో నాడు-నేడుతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మౌలిక వసతులతో తీర్చిదిద్ది, అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యా దీవెన పథకాలు అందించి పేద విద్యార్థులకు ఆసరాగా నిలిచారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా అండగా నిలబడి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుండుగోలు సుబ్బారావు, ఉప సర్పంచ్ బలుసు వెంకటేశ్వరరావు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, ఎంపీటీసీ బూరుగు శ్రీను, గుండుగోలను స్టీఫెన్, బేతిన రాఘవ, బొప్పన దుర్గయ్య, పులపాకుల ప్రసాద్, సచివాలయాల కన్వీనర్ షేక్ మీరా సాహెబ్, నల్లమిల్లి మనోజ్, చింతపల్లి సుధా, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

బాటగంగానమ్మ గ్రామోత్సవం


బాట గంగానమ్మకు నిర్వహిస్తున్న గ్రామోత్సవం

టి.నరసాపురం: బొర్రంపాలెంలో బాట గంగానమ్మ ఆలయ వార్షిక వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఆలయంలో అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక సాయి బాబా ఆలయం వద్ద నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం బొర్రంపాలెం ప్రధాన వీధుల్లో తిరిగి ఆలయానికి చేరుకుంది. మేళతాళాలు, విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఆదివారం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వాటర్ ప్రెజర్ పంప్ మెషీన్ల బహూకరణ


శ్రీవారి గోసంరక్షణశాలలో వాటర్ ప్రెజర్ పంప్ మెషీన్లను ప్రారంభిస్తున్న ఆలయ ఈఓ త్రినాథరావు

ద్వారకాతిరుమల: స్థానిక యూనియన్ బ్యాంక్ వారు శ్రీవారి గోసంరక్షణ శాలకు రూ.3.50 లక్షలు విలువైన 3 వాటర్ ప్రెజర్ పంప్ మెషీన్లను శనివారం బహూకరించారు. వాటిని ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు ప్రారంభించారు. ముందుగా యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ ఎం.గోపాలకృష్ణమూర్తి, డిప్యూటీ రీజనల్ హెడ్ డి.రామ్మోహన్‌రావు, స్థానిక బ్రాంచి మేనేజర్ కె.నాగేషుతో కలసి, ఈఓ త్రినాధరావు గోశాలలో మెషీన్లకు పూజలు నిర్వహించారు. అనంతరం స్విచ్ ఆన్ చేసి వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ గోశాలను ఎప్పటికప్పుడు శుభ్రపరచడం, అలాగే గోవులను కడిగేందుకు ఎంతగానో ఇవి ఉపయోగ పడతాయన్నారు.

మహిళలపై హింసను నిరోధించాలి


మహిళలపై హింస వ్యతిరేక ప్రచారోద్యమ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: మహిళలపై హింసను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సచివాలయాల శాఖా ఎస్‌బీసీసీ కోఆర్డినేటర్ టీఎస్ స్నేహన్ తెలిపారు. మహిళలపై హింస వ్యతిరేక ప్రచారోద్యమంలో భాగంగా అన్ని గ్రామాల్లో నిర్వహించాలన్నారు. కొయ్యలగూడెం మండల సమాఖ్య భవనంలో శనివారం సాయంత్రం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తోట కృపామణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్నేహన్ మాట్లాడారు. మహిళా హింస అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మహిళలపై జరిగే హింసను రెండు రకాలుగా వర్గీకరించారని, వాటిలో గృహ హింస, బహిరంగ హింస గురించి ఆయన వివరించారు. దేశ వ్యాప్తంగా మహిళపై సగటున గంటకు 49 నేరాలు జరుగుతున్నాయని గణాంకాలు తెలుపుతున్నాయన్నారు. తొలుత మహిళల చేత ప్రతిజ్ఞ చేయించి అనంతరం ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బేబీ శ్రీలక్ష్మి, ఏపీఎం సుబ్రహ్మణ్యం, సీసీ శ్రీనివాసరావు, మండల సమాఖ్య కార్యదర్శి సున్నం గంగాదేవి, కోశాధికారి సిర్ర కనకరత్నం, సీఏలు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతా చర్యలు చేపట్టాలి


విద్యుత్ భద్రతపై అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

కామవరపుకోట: విద్యుత్ భద్రతా చర్యలను ప్రతి ఒక్కరూ చేపట్టాలని డివిజన్ ఎలక్ట్రికల్ డీఈఈ కె.శ్రీనివాసరావు సూచించారు. ప్రతి నెలా రెండో తేదీన నిర్వహించే విద్యుత్ భద్రతా దినోత్సవంలో భాగంగా విద్యుత్ శాఖ సిబ్బంది, మండలంలో స్థానిక కొత్తూరులో గల సబ్‌స్టేషన్ దగ్గర నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, విద్యుత్ భద్రతపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 24 గంటల పాటు 1912కు సమాచారం అందజేయవచ్చన్నారు. సిబ్బందితోపాటు వినియోగదారులు విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తడికలపూడి ఏఈ ఎంఎస్ హర్షవర్ధన్‌రావు, జేఈపీ శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ లైన్‌మన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

- తుపాను నేపథ్యంలో హెచ్చరికలు జారీచేసిన అధికారులు
- రక్షణ చర్యలకు సిద్ధమైన అన్నదాతలు


కొయ్యలగూడెంలో పంట రక్షణ చర్యలపై రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారి

టి.నరసాపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావం కోస్తా జిల్లాలపై ఉండనున్న వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో టి.నరసాపురం మండల వ్యవసాయ అధికారి డి.ముత్యాలరావు క్షేత్ర పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు పంట కోత, పంటను జాగ్రత్త చేసుకోవడంపై పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని 2600 ఎకరాల్లో వరి సాగు చేశారని, ప్రస్తుతం కోత దశలో ఉన్నాయన్నారు. తుపాను నేపథ్యంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి సాగు చేసిన రైతులు కోతలను 3 నుంచి 5 రోజుల పాటు వాయిదా వేయాలన్నారు. కోతలు కోసి కళ్లాలపై ధాన్యం ఉన్నట్లయితే ధాన్యం తడవకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏదైనా కారణంగా పనలు తడిస్తే మొలక రాకుండా 5శాతం ఉప్పు ద్రావణం పిచికారి చేయాలన్నారు.

కొయ్యలగూడెం: తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులందరూ కోసిన ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలని, తేమశాతం పదిహేడులోగా ఉన్నపుడే ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రంలో విక్రయించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్నకేశవులు తెలియజేశారు. తుపాను నేపథ్యంలో కొయ్యలగూడెం పరిసర గ్రామాలలో వ్యవసాయ పొలంలో పంటల రక్షణ చర్యల గురించి శనివారం స్వయంగా రైతుల వద్దకు వెళ్లి ఆయన సూచనలు చేశారు. కొయ్యలగూడెం మండలంలో 6,200 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారని, 2,100 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయన్నారు. మండలంలో రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు సూచనలు సలహాలు అందించడానికి సిబ్బంది సహాయం తీసుకోవాలన్నారు. కోతలకు సిద్ధంగా ఉన్న పొలాలను మూడు రోజులు ఆలస్యంగా కోతలు నిర్వహించుకోవాలని రైతులకు సూచించారు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది తమ పరిధిలోని రైతులకు పంట జాగ్రత్తపై అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు.

చింతలపూడి: వాతావరణ శాఖ తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు సత్వర చర్యలు తీసుకుని పంటలను కాపాడుకోవాలని వ్యవసాయ శాఖ చింతలపూడి సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ బి నాగ కుమార్ శనివారం తెలిపారు. వరి పంట గింజ గట్టిబడి కోతకు సిద్ధంగా ఉంటే వెంటనే కంబైన్డ్ హార్వెస్టర్ ఉపయోగించి, వచ్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతములో వర్షానికి తడవకుండా ఆరబెట్టుకోవాలన్నారు. తగినన్ని టార్పలిన్, పాలిథిన్ పట్టాలను పూర్తి స్థాయిలో అందుబాటులో పెట్టుకోవడం, తుపాను వెలిసిన తరువాత ఆ ధాన్యాన్ని ఆరబెట్టుకునే విధముగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వరి పంట కోసి పనలు చేనులో ఉండే పరిస్థితులలో తక్షణమే పనలను కట్టలు కట్టి గూడు కుప్పలు పోసి పంటను వర్షానికి తడవకుండా చూడాలన్నారు. తడిసిన పనలలో మొలకలు రాకుండా 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. అలాగే మెట్ట పంటలు పత్తి, మిరప పంటల చేనులలో వర్షపు నీరు నిలవకుండా, వర్షపు నీరు వేగముగా, సులభముగా కొట్టుకు పోయే విధముగా చేల గట్లలో ఎక్కువ సంఖ్యలో వాలుకూ నిలువుగా గండ్లు చేయాలన్నారు. పత్తి పంట 3 వ తీతకు కాయలు విచ్చుకుని పత్తి తీతకు సిద్ధమైన కాయల నుంచి పత్తిని తీయడం, మిరపలో తయారైన పర్చి మిరప, పండు మిరపను చేను నుంచి కోయాలన్నారు. వానలు తగ్గిన తర్వాత విల్ట్ తెగులు సోకకుండా బ్లైటాక్స్/మ్యాంకోజెబ్ డ్రెంచింగ్ విధానం, పొటాషియం నైట్రేట్ పిచికారీ, యూరియా, పొటాష్ మొక్కల మొదల్లో వేయుట (పోకెటింగ్)తదితర విషయాల్లో ముందుగానే అవగాహన కల్పించాలని రైతు భరోసా కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు సూచించారు. జిల్లాలకు సంబంధించిన కేవీకే, వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమన్వయం చేసుకుంటూ రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా తోడ్పడాలని సంబంధిత అధికారులకు తెలిపారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి


ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ రాంబాబు

చింతలపూడి: మండలంలోని మల్లాయగూడెం ప్రాథమికోన్నత పాఠశాలను మండలపరిషత్ అధ్యక్షుడు డా బి.రాంబాబు నాయక్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని, వసతులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడడానికి ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మురళీకృష్ణ, ఎంఈఓ జి రామారావు, జూనియర్ అసిస్టెంట్ అశోక్, వైఎస్సార్ సీపీ నాయకులు చీకటి బాపూజీ, చీకటి సత్యన్నారాయణ, వీఆర్ఓ గోపాలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిజాతగిరిలో ప్రత్యేక పూజలు



జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో కార్తీక శనివారం సందర్భంగా విశేష పూజలు చేశారు. సుప్రభాత సేవ, ఆరాధన, భాలబోగం నివేదన, తోమాలసేవ, తీర్థప్రసాదగోష్ఠి తదితర పూజలు అర్చకులు నిర్వహించారు. మాలాధారణ స్వాములు స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీస్వామి వారి కొండపైకి కాలినడకన ఏజెన్సీ ప్రాంతంలో గ్రామాల్లో నుంచి, భీమవరంలో యనమకుదురు, శ్రీదేవరపల్లి(చిక్కాల)గ్రామంలో నుంచి వచ్చి స్వామి వారిని దర్శించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు పెనుగొండకు చెందిన ఇండిపికయ్యాల శ్రీనివాస్, పద్మావతి దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. నల్లూరి రవికుమార్ ఆచార్యులు, ఋషికేశ్ ఆచార్యులు వేద పండితులు దాతలకు ఆశీస్సులు, స్వామి వారు శేషవస్త్రాలు ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఈవో మానికల రాంబాబు పర్యవేక్షించారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు


జీలుగుమిల్లిలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): ఓటరు నమోదు కోసం ప్రతి పోలింగ్‌స్టేషన్ వద్ద శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ జి.సుందర్ సింగ్ తెలిపారు. శనివారం ఆయన జీలుగుమిల్లిలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు, ఓటర్ లిస్ట్‌లోని సవరణలకు సంబంధించి డిసెంబర్ 2, 3 తేదీల్లో మండలంలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌లో శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 32 పోలింగ్ స్టేషన్‌లు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఓ టి.రాజు, వీఎల్ఓలు ప్రసన్న, కన్నయ్య, కళ్యాణి, కస్తూరి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: ఓటర్ అవగాహన ర్యాలీ కార్యక్రమం శనివారం మండలంలోని పలు గ్రామాలలో నిర్వహించారు. ఎంపీడీవో ఆర్ బేబీ శ్రీ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖఅధికారి పి.శ్యాం సుందర్ హాజరై అవగాహన ర్యాలీ, సమావేశాలలో పాల్గొన్నారు. బయ్యనగూడెం, సీతంపేట, నరసన్నపాలెం పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బయ్యనగూడెంలో ఓటర్లకు అవగాహన కల్పించారు. ఎంఈవో జె సురేష్ బాబు, మండల వ్యవసాయాధికారి చెన్నకేశవులు, బూత్ లెవెల్ అధికారులు, ఆయా గ్రామాల వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో పేర్లు సరిచూసుకోండి

చింతలపూడి: ఓటర్ల జాబితాల్లో తమ పేర్లుఉన్నదీ, లేనిదీ సరిచూసుకోవాలని చింతలపూడి ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి కె గీతాంజలి ఓటర్లకు సూచించారు. మండలంలోని పలు పోలింగ్ బూత్‌లను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితాల్లో లోపాలు ఉంటే ఈ నెల 2, 3 తేదీల్లో జరుగుతున్న ప్రత్యేక క్యాంపుల్లో బూత్ లెవెల్ అధికారులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. ఓటర్ల జాబితాల్లో మరణించిన వారి పేర్లు తొలగించాలని, అర్హుల పేర్లు జాబితాల్లో చేర్చే ప్రక్రియను వేగవంతం చేయాలని బీఎల్‌ఓలకు ఆదేశించారు. ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ఉప తహసీల్దార్ శేఖర్, డిప్యూటీ తహసీల్దార్ షకీలున్నీసా బేగం, నగర పంచాయతీ కమిషనర్ ఎస్.రాంబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.